క్లుప్తంగా

కొనుగోలు కేంద్రంలో డీఏఓ పరిశీలన



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ మంగళవారం పరిశీలించారు. కేంద్రాన్ని రైతు వేదికకు మార్చాలని ఆమె ఆదేశించారు. రైతులు తేమ లేకుండా ధాన్యాన్ని కేంద్రానికి తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దొంగల రమేష్, నోడల్ ఆఫీసర్ కల్యాణి, ఏఈఓ సంపత్, సీఈఓ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో విద్యుత్ ప్రమాదాల నివారణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈ ఆనందం

నర్సంపేట రూరల్ : అవగాహన కలిగి ఉండడం ద్వారా విద్యుత్ ప్రమాదాల నివారణ సాధ్యమని ఆ శాఖ డీఈ ఆనందం తెలిపారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

సన్మానం



నర్సంపేట : స్థానిక మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన నేపథ్యంలో ఆయన్ను బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో సన్మానించారు. నాగరాజుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహరాములు, సీనియర్ నాయకులు ఠాకూర్ రవీందర్‌సింగ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పాదిశ్ల రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఐకి రఘుపతికి..



నర్సంపేట రూరల్: నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన సీఐ రఘుపతిని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహరాములు, తదితరులు మంగళవారం శాలువా కప్పి పూల బొకే అందించి సన్మానించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా భిక్షపతి



పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్‌కు చెందిన చీమల భిక్షపతి బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మూడు నెలలుగా పార్టీ మండల అధ్యక్షుడి ఎన్నిక కోసం పలువురు పోటీలో ఉండగా భిక్షపతి ఎన్నికవడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని చెప్పారు.

ఉపాధ్యక్షురాలిగా తాళ్ల భవాని

నర్సంపేట : బీజేపీ చెన్నారావుపేట మండల ఉపాధ్యక్షురాలిగా లింగాపురం గ్రామానికి చెందిన తాళ్ల భవాని రఘును నియమించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆమెకు నియామక పత్రం అందజేశారు.

'వసతులు కరువు'

దుగ్గొండి : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు కరువయ్యాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గిర్నిబావిలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆధ్వర్యంలోని బృందం మంగళవారం సందర్శించి సమస్యలను అధ్యయనం చేసింది. అనంతరం రైతుల సమస్యలను ఏఈఓ వైజయంతి దృష్టికి శ్రీనివాస్ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతుకు, ధాన్యానికి రక్షణ కరువైందన్నారు. సరిపడా టార్పాలిన్ షీట్లు లేవని చెప్పారు.

గీత కార్మికుడికి గాయాలు

నెక్కొండ : మండలంలోని సూరిపల్లికి చెందిన గీత కార్మికుడు గోపగాని కట్టయ్య తాటి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. తోటి కార్మికులు గమనించి కట్టయ్యను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

చెత్త సేకరణలో తిప్పలు

- కేవలం ప్రధాన వీధిలోనూ రోజూ..
- ఒక్కో కాలనీ నుంచి వారానికోసారి

వర్ధన్నపేట : స్థానిక మున్సిపాలిటీలో చెత్త సేకరణకు తిప్పలు తప్పడం లేదు. కేవలం ప్రధాన వీధిలో మాత్రమే రోజూ చెత్త సేకరణ జరుగుతోంది. ఒక్కో కాలనీ నుంచి వారానికోసారి మాత్రమే చెత్త సేకరిస్తున్న దుస్థితి నెలకొంది. తరచూ వాహనాలు మరమ్మతులకు గురికావడంతోపాటు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చెత్త సేకరణ, తరలింపు సమస్యాత్మకంగా మారిందన్న విమర్శలున్నాయి. స్థానిక మునిసిపాలిటీ పరిధిలో 12 డివిజన్లు ఉన్నాయి. ఇందులో 3 తండాలతో ఉండగా మరో 9 డివిజన్లు వర్ధన్నపేట, కోనాపురంతో కలిసి ఉన్నాయి.

వాహనాలు అరకొర.. వాటిలో మరమ్మతులే..

మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు ఓ ట్రాక్టర్‌తోపాటు 4 ఆటో ట్రాలీలున్నాయి. ఈ వాహనాలతో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రోజూ సుమారు 3 మెట్రిక్ టన్నులకుపైగా చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. కాగా ఎప్పుడూ రెండు వాహనాలు మరమ్మతులకు గురి అవుతుండడంతో మిగితా మూడు వాహనాలతోనే షెడ్యూల్ ప్రకారం తరలించే ప్రయత్నం చేస్తున్నా చెత్త పేరుకుపోతున్నట్టు తెలుస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో కాలనీ ప్రజలు చెత్త బండి కోసం వారం రోజులు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది.



ఆటో ట్రాలీలో చెత్త వేస్తున్న ప్రజలు

వారానికి ఒకసారి మాత్రమే..



మా కాలనీలో వారానికి ఒకసారి మాత్రమే చెత్త సేకరణ వాహనం వస్తోంది. దీంతో ఇళ్లలో చెత్త పేరుకుపోతూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనీసం రెండ్రోజులకోసారైనా చెత్త సేకరించాలి.

– మహబూబ్, స్థానికుడు, వర్ధన్నపేట

వాహనాల కోసం ప్రతిపాదనలు



తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. అయినా అన్ని వీధుల్లో చెత్త సేకరణకు చర్యలు తీసుకుంటున్నాము. మరో 4 ట్రాలీ ఆటోల కోసం ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ప్రతిపాదనలు పంపించాము.

– సుధీర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

డ్రెయినేజీని సత్వరమే పునర్నిర్మించాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : పట్టణంలోని జయలక్ష్మి సెంటర్ కల్వర్టు డ్రెయినేజీని సత్వరమే నిర్మించాలని అధికారులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశించారు. జయలక్ష్మి సెంటర్‌లోని వరమ్మతోటతోపాటు 15, 16, 4వ డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న కల్వర్టు, మురికినీటి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆయన కల్వర్టు, డ్రైనేజీని మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పూర్వం రాతి కట్టుతో నిర్మించిన డ్రైనేజీ కల్వర్టులు శిథిలమైన తర్వాత హైలెవల్ కల్వర్టు నిర్మించడంతో ఇళ్లలోని నీరు చేరుతోందన్నారు. కల్వర్టు డ్రైనేజీని జూన్ 10లోపు పునర్నిర్మించాలని స్పష్టం చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు తాళ్లపెల్లి శ్రీలత ఇంటి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ రాజేశ్ కుమార్, మాజీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, 16వ డివిజన్ ఇన్‌చార్జ్ బాణాల శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షుడు వేముల సారంగం గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ ప్రెసిడెంట్ ఉత్తమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఐక్య ఉద్యమాలతోనే హక్కుల పరిరక్షణ

- కేయూ ప్రొఫెసర్ డాక్టర్ ఈసం నారాయణ

నర్సంపేట : ఐక్య ఉద్యమాలతోనే హక్కులను పరిరక్షించుకోగలమని కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ ఈసం నారాయణ స్పష్టం చేశారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో ఆదివాసీ సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం పట్టణ కమిటీ, ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం జిల్లా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సంక్షేమ సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు సువర్ణపాక పాపారావు అధ్యక్షతన 'ఐదో షెడ్యూల్ ప్రాంతాల హక్కుల పరిరక్షణ'పై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు నారాయణ అతిథిగా హాజరై మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రముఖ న్యాయవాదులు వాసం ఆనంద్‌కుమార్, అర్రెం పాపారావు మాట్లాడుతూ 1/70 చట్టానికి భంగం కలగకుండా ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో భూభారతి చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తెల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే దిశగా న్యాయ పోరాటం చేస్తామన్నారు. సదస్సులో నాయకులు గెడం జనార్దన్, వట్టం సాయిలు, ఈక నర్సయ్య, కాక నర్సయ్య, కొట్నాక ప్రవీణ్, ఈసాల కృష్ణయ్య, కొట్టెం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

ఆత్మీయ సమ్మేళనం



వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో 2009–10 విద్యాసంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వవిద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంలో మునిగి తేలారు. నాడు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు.

నియామకం



నర్సంపేట : నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన మచ్చిక రాజు గౌడ్‌ను జాతీయ మానవ హక్కుల కమిటీ నర్సంపేట నియోజకవర్గ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు మాట్లాడారు. సమాజంలో అన్యాయాలు, అక్రమాలపై పోరాడాలన్నారు. రాజును అభినందించారు.

రజక సంఘం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా..



రమేశ్

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం ప్రాంతానికి చెందిన గట్టికొప్పుల రమేశ్‌ను రజక సంక్షేమ సంఘం (ఆర్‌ఎస్‌ఎస్) రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నియమించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేరాల ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. రమేశ్ గతంలో సంఘం జిల్లా డైరెక్టర్‌గా పని చేశారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి

ఖానాపురం : ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని ఆయిల్ పామ్ పంటను ఆ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడేళ్లపాటు పంటను కాపాడుకోవాలని సూచించారు. పంటలో లేతవేర్లకు పోశకాలు అందేలా యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలకు డ్రిప్ ద్వారా నెలకోసారి హ్యూమిక్ యాసిడ్ అందించాలని తెలిపారు. అలాగే 18 నుంచి 36 నెలల తప్పనిసరిగా మగ, ఆడపూత తొలగించాలని చెప్పారు. పంట సాగులో సమస్యలు ఎదురైతే అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. రానున్న ఆరునెలల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట కోసం కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా టెక్నికల్ అధికారి రాకేశ్, డివిజన్ అధికారి జ్యోతి, ఏఈ శ్రీనివాస్, డ్రిప్ కంపెనీ మేనేజర్ భవానీ ప్రసాద్, జీఎంలు రాంచరణ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగీతలక్ష్మి

విద్యార్థుల ఉన్నతే జేవీవీ లక్ష్యం

- జిల్లా అధ్యక్షుడు మోతె ఇంద్రసేనారెడ్డి

నర్సంపేట : విద్యార్థుల ఉన్నతే జన విజ్ఞాన వేదిక (జేవీవీ) లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు మోతె ఇంద్రసేనారెడ్డి తెలిపారు. పట్టణంలోని సంజీవని ఆశ్రమంలో వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల వేసవి శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ప్రతిభా పాటవాలను పెంపొందించుకునేలా వేసవి సెలవుల్లో పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుంటె ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడానికైనా వేదిక సిద్ధంగా ఉందన్నారు. మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఏటా వినూత్న తరహాలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి నైపుణ్యాన్ని పెంపొందిస్తోందని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేదిక జనరల్ సెక్రటరీ సుధాకర్, జిల్లా సంస్కృతిక కన్వీనర్ యాకయ్య, మండల జనరల్ సెక్రటరీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి

- గూగుల్ మీట్‌లో డీఆర్‌డీఓ కౌసల్యదేవి

నర్సంపేట/వర్ధన్నపేట: సంఘాలను బలోపేతం చేయాలని గూగుల్ మీట్‌లో డీఆర్‌డీఓ కౌసల్యదేవి ఆకాంక్షించారు. చెన్నారావుపేట, వర్ధన్నపేట మండలాల్లో ఏర్పాటు చేసిన బాలిక స్నేహ సంఘాలను ఉద్దేశించి ఆమె సందేశం ఇచ్చారు. స్నేహ సంఘాల ద్వారా బాలికలకు గ్రూపులను ఏర్పాటు చేసి సేఫ్టీ, సెక్యూరిటీ, సస్టయ్ నబులిటి, న్యూట్రిషన్, హెల్త్, హైజెనిక్, తదితర అంశాలపై అవగాహన, ప్రత్యేక అంశాలతో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్ధన్నపేట మండలంలోని కట్య్రాల, కుమ్మరిగూడెం, ఇల్లంద గ్రామాలను సందర్శించిన డీఆర్‌డీఓ కౌసల్య దేవి ఈజీఎస్ పథకం ద్వారా చేపట్టిన ఫౌల్ట్రీ ఫామ్స్, కొబ్బరి తోటలు, కాంపోస్ట్ పనులను పరిశీలించారు. కార్యక్రమాల్లో అడిషనల్ డీఆర్‌డీఓ రేణుక దేవి, డీపీఎం భవాని, ఏపీఎం ఈశ్వర్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.



గూగుల్ మీట్‌లో పాల్గొన్న స్నేహ సంఘం సభ్యులు

కార్మికుల్లో చైతన్యమే ఆటోయాత్ర ధ్యేయం

- యూనియన్ జేఏసీ అధ్యక్షుడు రవికుమార్

నర్సంపేట : కార్మికులను చైతన్యవంతం చేయడమే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా ఆటోయాత్ర చేపట్టినట్లు ఆటో యూనియన్ జేఏసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ తెలిపారు. ఆటోయాత్ర పట్టణానికి మంగళవారం చేరుకోగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు ఆధ్వర్యంలో ఆటోకార్మికులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ఆటోకార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈనెల 27న హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన సభకు ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ టౌన్ అధ్యక్షుడు తేజావత్ సాయి, మల్లంపల్లి అడ్డ అధ్యక్షుడు పూజారి బాబు, మాదన్నపేట రోడ్డు అడ్డ అధ్యక్షుడు ఎం.రవికుమార్, నాయకులు జీవన్, రఘు, సాయి, పవన్, మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

భూదందాలు, సెటిల్‌మెంట్లను అరికట్టాలి

- ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

గీసుకొండ : భూదందాలు, సెటిల్‌మెంట్లను అరికట్టాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ పరిధిలోని కే స్ట్రీట్‌లో మంగళవారం నిర్వహించిన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆజంజాహి మిల్లు భూములు గతంలో పని చేసిన కార్మికుల కుటుంబాలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గంజాయి, భూదందాల నివారణకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కమిటీ జిల్లా చైర్మన్ గంగుల అశోక్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు లాగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో కమిటీ హన్మకొండ జిల్లా చైర్మన్ దుబాసి నవీన్, గ్రేటర్ వరంగల్ చైర్మన్ సరళాదేవి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

బాధిత రైతులను ఆదుకోవాలి

ఖానాపురం : అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పంటలు నష్టపోయినా ప్రస్తుత ఎమ్మెల్యే మాధవరెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి లేదన్నారు. పంటల నష్టంపై సర్వే చేయిస్తామని ఎమ్మెల్యే మాధవరెడ్డి హామీ ఇచ్చినా సర్వే చేయించలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలకు కేరాఫ్‌గా నిలుస్తోందని ధ్వజమెత్తారు.

వర్షానికి తడిసిన ధాన్యం

పర్వతగిరి/సంగెం : పర్వతగిరి, సంగెం మండలాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో ధాన్యం తడిసింది. పర్వతగిరి మండలంలోని రోళ్లకల్, జమాల్‌పురం, వడ్లకొండ, ఏనుగల్, చింతనెక్కొండ, చౌటపల్లి, దౌలత్‌నగర్, పర్వతగిరి, కల్లెడ, బూర్గుమడ్ల, అన్నారం షరీఫ్, సంగెం మండలంలోని చింతలపల్లి, షాపూర్, తీగరాజుపల్లి, గవిచర్ల, తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం తడిసింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. భారీ ఈదురు గాలులతో పలు చోట్ల ఇళ్ల కప్పులు లేచిపోయాయి. నర్సరీల్లో షెడ్‌నెట్లు చెలాచెదురయ్యాయి.

పేకాట స్థావరంపై దాడి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి వాగు సమీపంలోని పేకాట స్థావరంపై దాడి చేసి రూ.6740 నగదు స్వాధీనం చేసుకుని 11 మందిపై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి



నర్సంపేట : మాట్లాడుతున్న వైద్యాధికారి సరోజ

- పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ

నర్సంపేట : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని చెన్నారావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ కోరారు. ఆశా వర్కర్స్ డే సందర్భంగా ఆ పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు పర్యవేక్షించాలని చెప్పారు. డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత, ఆరోగ్య పర్యవేక్షకులు ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

ఖానాపురం : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. మండలంలోని బుధరావుపేటలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'మహిళల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలు, బాలల చట్టాలు'పై మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. బాల్యవివాహాలతో బాలికల జీవితంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. అనంతరం సఖి, హెల్ప్‌లైన్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ బాధ్యులు స్వప్న, మౌనిక, పద్మలత, అనిల్‌కుమార్, భద్రయ్య, వసంత, ప్రేమలత, దేవిక, తదితరులు పాల్గొన్నారు.

టాటా ఏస్ బోల్తా.. ఐదుగురు కూలీలకు గాయాలు

రాయపర్తి : టాటా ఏస్ బోల్తా పడి ఐదుగురు కూలీలకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బంధనపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ఇండ్ల స్లాబ్ కూలీ పనుల కోసం టాటా ఏస్‌లో 12 మంది కూలీలు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

యాసిఫ్ పాషాకు డాక్టరేట్

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన ఎండీ యాసిఫ్ పాషా డాక్టరేట్ అందుకున్నారు. చిరు వయసులో మీడియా సంస్థ ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి అవకాశాలను కల్పిస్తుండడంతోపాటు అన్యాయాలను వెలికితీస్తుండడంతో డాక్టరేట్ అందించినట్లు ఆయన మీడియాకు తెలిపారు. హైదరాబాద్‌లో హోప్ థియలాజికల్ యూనివర్సిటీ ప్రతినిధులు యాసిఫ్‌కు డాక్టర్ ఆఫ్ బెస్ట్ మీడియా ఎడిటర్ ఇన్ చీఫ్ గౌరవ పురస్కారం అందజేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న యాసిఫ్‌పాషా

సమ్మెను జయప్రదం చేయాలి

నర్సంపేట : ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె యువరాజు, ఏఐసీటీయూ బాధ్యులు మాషుక్ అలీ, హమాలీ సంఘం రాష్ట్ర నాయకుడు గుంపెల్లి మునీశ్వర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోతు సాగర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ కోరారు. స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో బరిగల కుమార్, హన్మకొండ శ్రీధర్, గోవర్ధనచారి, పెరమాండ్ల రవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సదస్సులో రమేష్, రామస్వామి, యువరాజు, మాషుక్ అలీ, మునీశ్వర్, సాగర్, రాజేందర్ మాట్లాడారు.

'తాటిచెట్ల దహనం సరికాదు'

నల్లబెల్లి : నర్సంపేట శివారు జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలోని తాటిచెట్లను దహనం చేయడం సరికాదని గోపా యువజన సంఘం మండల అధ్యక్షుడు కామగాని దిలీప్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాటిచెట్లను దహనంపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఖానాపురం : మండలంలోని రాగంపేటకు చెందిన పురుషోత్తంకు మంజూరైన రూ.41,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ హైస్కూల్‌లో వేసవి శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభమైంది. విద్యార్థులకు డ్రాయింగ్, ఆటలు, కుట్టు అల్లికల్లో శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో ట్యూటర్లు పాలెపాక ప్రణయ్, పర్ష కిశోర్, అలువాల స్రవంతి, హెచ్‌ఎం సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధర్మరావుపేటలో..

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిమ్నాస్టిక్స్ శిబిరం కొనసాగుతోంది. మంగళవారం దాతల సహకారంతో విద్యార్థులకు అరటిపండ్లు, కొడిగుడ్లతోపాటు స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీల్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విజాకర్‌రావు, మాద్రాజు వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

రాయపర్తి : ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రభాకర్, నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెర్కవేడులో తల్లిదండ్రులకు అధ్యాపకులు మంగళవారం అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. అందువల్లే ఈ ఏడాది ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. నాణ్యమైన విద్యతోపాటు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నర్సంపేట/ నర్సంపేట రూరల్: నర్సంపేటలోని ఓంకార్ భవన్‌లో, మాధన్నపేటలో ఎంసీపీఐ(యూ) మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శతజయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, జిల్లా నాయకుడు కొత్తకొండ రాజమౌళి మంగళవారం ఆవిష్కరించారు. ఈనెల 12న మచ్చాపురంలోని ఓంకార్ స్మారక స్తూపం వద్ద తలపెట్టిన శతజయంతి ఉత్సవాల ప్రారంభ సభను విజయవంతం చేయాలని కోరారు.